ప్రజల వద్దకే పాలన తెచ్చిన సీఎం జగన్

- 35, 44వ డివిజన్లలో 91వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే తెచ్చిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 91వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏలూరు 35వ డివిజన్ 12 పంపుల సెంటర్, గొర్రెలవారి వీధి నుంచి ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏలూరు నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, 44వ డివిజన్ కార్పొరేటర్ పాలిమేర రామదాసు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి అపూర్వ స్వాగతం పలికారు. పలు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నాని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపంతో అర్హులకు పథకాలు అందకపోతే సత్వరమే వాటిని పరిష్కరించి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత మెరుగైన రీతిలో ప్రభుత్వ పాలనను చేరువ చేశారని చెప్పారు. తమ ప్రభుత్వంలో ప్రజలే ప్రభువులని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించటమే తమ ప్రధాన కర్తవ్యమని నాని అన్నారు. గతంలో ఒక సామాన్యమైన వ్యక్తి ఏదైనా సర్టిఫికెట్ పొందాలంటే రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాల్సిన పరిస్థితి ఉండేదని, రాజకీయ నేతల సిఫార్సులు ఉంటే తప్ప పనులు అయ్యేవి కాదని గుర్తుచేశారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తమ ఇంటికి సమీపంలోనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేయటంతో అవినీతికి తావులేకుండా సులువుగా పనులన్నీ పూర్తవుతున్నట్టు చెప్పారు. ఇక ప్రభుత్వ పథకాలకు ఇంటికే వలంటీర్ వచ్చి మరీ నమోదు చేస్తున్నారని, వృద్ధులకు పింఛన్ తెల్లవారకముందే అందిస్తూ మరో చరిత్ర సృష్టించారని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్‌కుమార్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి, అర్జి సత్యవతి, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, నాయకులు వైఎస్‌వీ శివరావు, నిడికొండ నరేంద్ర, లీగల్‌సెల్ దొంగ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

క్లుప్తంగా

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



కొవ్వలిలో నూతన వరికోత యంత్రాన్ని ప్రారంభించిన కొఠారు రామచంద్రరావు

దెందులూరు: రైతు సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తుందని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం కొవ్వలి గ్రామ రైతుల ఆహ్వానం మేరకు నూతన వరి కోత యంత్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు, సాగుకు ముందస్తు పెట్టుబడితో పాటు అనేక పథకాలు అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

నేత్రపర్వం.. సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్ : ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్రా నక్షత్రం పురస్కరించుకుని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో సోమవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గుణ్ణంపల్లిలో బీసీ బహిరంగ సభ

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లిలో ఏపీ బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో సోమవారం బీసీ బహిరంగ సభను నిర్వహించారు. ఏపీ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొండాడ వెంకన్నబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బీసీ కుల జన గణనను వెంటనే చేయాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన ఎజెండాతో ఈ సభను నిర్వహించినట్టు ఏలూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడు యడ్లపల్లి నటరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

20న తపాలా కార్యాలయాల వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న దాసరి నాగేంద్ర కుమార్

ఏలూరు (టూటౌన్): ఏపీ తపాలాశాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న ఎస్సీ, ఏలూరు పెద్ద పోస్టాఫీసు, సత్రంపాడు ఇండ్రస్టియల్ ఎస్టేట్‌లోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు సంఘం ఏపీ సర్కిల్ సెక్రటరీ దాసరి నాగేంద్ర కుమార్ తెలిపారు. స్థానిక పెద్ద పోస్టాఫీసు ఆవరణలోని అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘంపై ఎన్ఎఫ్‌పీఈ, ఎఫ్ఎన్‌పీఓ అను ట్రేడ్ యూనియన్ సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. తమపై లేనిపోని నిందారోపణలు చేస్తూ పోస్టుమాస్టర్ జనరల్‌కు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. తమ సంఘంపై ఆరోపణలు 15 రోజుల్లోగా నిరూపించని యెడల ఫిర్యాదుదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోస్టు మాస్టర్ జనరల్‌ను కోరారు. దళిత బహుజన ప్రజా సంఘాల తరుపున అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఉపాధ్యక్షుడు దాసరి రమేష బాబు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు, దాసరి ఆంజనేయులు, తమలం ప్రసాద్, అంబేడ్కర్ పూలే వేదిక చైర్మన్ నేతల రమేష్ బాబు మాట్లాడారు.

సహకార ఉద్యోగుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సహకార ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, సహకార సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కోరారు. ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వం చట్ట సవరణ ప్రకారం 50 శాతం షేర్లను బయట వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. చట్ట సవరణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్బీకేలను సహకార సంఘాల్లో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు, జిల్లా కార్యదర్శి పి.సుబ్బారావు మాట్లాడుతూ 2019 నుంచి కొత్త వేతన సవరణ చట్టం చేయాలని, ధాన్యం సేకరణలో నష్టాలను తొలగించాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. టీడీఎస్‌ను సహకార సంఘాలకు వర్తింప చేయరాదన్నారు. జిల్లా డీసీసీబీ వెనక్కి కట్టించుకున్న 6 శాతం వడ్డీ రాయితీని వెంటనే సర్దుబాటు చేయాలని, 2010–11 నుంచి దాదాపు 13 సంవత్సరాల క్రితం సహకార సంఘాలకు రావాల్సిన ఆరు శాతం డివిడెండు లేదా వడ్డీ వెంటనే చెల్లించాలని కోరారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ మూర్తికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.వీరయ్య, పి.రాధాకృష్ణ, ఆర్.గణేష్, సర్వేశ్వరరావు, సత్యనారాయణ రాజు, జీవీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భవనాలు కోరుతూ రిలే దీక్షలు



కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి, శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ విద్యార్థులు కలెక్టరేట్ వద్ద సోమవారం సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ దీక్షలను ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ప్రారంభించారు. విద్యార్థులు చేసే ప్రతి ఉద్యమంలో తాను తోడుగా ఉంటానన్నాని సాబ్జి చెప్పారు. ఏపీ విశ్రాంత కళాశాల అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. ఏలూరులో 2008లో ఏర్పాటు చేసిన డిగ్రీ కాలేజీకి నేటికీ సొంత భవనాలు లేకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. దీక్షలకు టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జి బడేటి చంటి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, ఆమ్ఆద్మీ నేత మస్తాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీఐటీయూ నేత డీఎన్‌వీడీ ప్రసాద్, పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు తమ మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ క్రాంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అనిల్, పి.దుర్గాప్రసాద్, వి.ఠాగూర్, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులపై నిరంతర పరివేక్షణ కొనసాగించాలని ఏలూరు మండల ప్రత్యేక అధికారిణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్ కుముదిని అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల మండలాధికారులతో సమీక్షించారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ క్లినిక్, సీసీరోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, ఉపాధి పనులు, వైద్యసేవలు, నాడు – నేడు పనుల వేగవంతానికి ప్రభుత్వం జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించిందని కుముదిని తెలిపారు. ఈ అధికారి గ్రామాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు చేస్తారని చెప్పారు. అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు రిపోర్ట్ సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలోనే అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ సచివాలయం, గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రతి వారం తమ పరిధిలో అభివృద్ధి పనులపై ప్రోగ్రెస్ రిపోర్ట్ తయారు చేసుకోవాలని అన్నారు. స్పందన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రులో 100కు పైగా కొత్త ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టామని హౌసింగ్ సిబ్బంది వివరించారు. జగనన్న కాలనీల్లో సుమారు రూ.3 కోట్లతో సెకండ్ లేయర్ లెవెలింగ్ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎంఎస్‌ఆర్ఈజీఎస్ ఏపీఓ కిషోర్ చెప్పారు. మల్కాపురం, చొదిమెళ్లలో వరికోతలు ప్రారంభమవుతున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంఏఓ జీవనసంధ్య అన్నారు. ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని దళిత సేన అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల రమేష్ కోరారు. స్థానిక లకంపేటలో ఈ రెండు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల్లో విచారణ వేగవంతం చేయాలన్నారు. దళిత మహిళలు, రైతులపై జరిగే వేధింపులను పూర్తిగా అరికట్టాలని కోరారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులలో అరెస్టు చేసే విషయంలో ముద్దాయిలకు 41 పీఆర్సీసీ క్రింద నోటీసులు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కేసుల్లో ముద్దాయిలను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. సమావేశంలో దళిత నాయకులు, దళిత సేన, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీలకు న్యాయం చేయాలి



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): 1998 డీఎస్సీ నియామకాలపై సమగ్ర విచారణ నిర్వహించిన ఎస్సీలకు న్యాయం చేయాలని కోరుతూ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆ వివరాలను ఏలూరులో విలేకరులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 1998 డీఎస్సీ సెలెక్ట్ ఉపాధ్యాయులను నియమించిందన్నారు. ఈ నియామకాలు కాంట్రాక్ట్ పద్ధతిలో దాదాపు 4,534 క్వాలిఫైడ్ అభ్యర్థులకు జీఓ నెం.27 ప్రకారం 3,620 పోస్టుల్లో నియమించినట్టు చెప్పారు. ఈ నియామకాల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలు చేయలేదని గుర్తు చేశారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ ఉపాధ్యాయులకు కాంట్రాక్ట్ బేస్ (ఎంటీఎస్)తో నియమించినట్టు చెప్పారు. దీని వల్ల అర్హులైన పలువురు ఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు.

వృద్ధులకు వరం వైఎస్సార్ కంటివెలుగు

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం వరమని, ఈ కార్యక్రమంలో కంటి పరీక్షలుచేసి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు ఇస్తామని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం మండలం వరదరాజపురంలో వృద్ధులకు కంటివెలుగు పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం తదితర అంశాలు వివరించారు. ఈ సందర్భంగా 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. సర్పంచ్ కోడేటి నర్సింహమూర్తి, సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దాత ఫజ్లుల్ రెహమాన్‌కు ముతవల్లి పదవి



ముతవల్లి పదవి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ సాబ్జి

దెందులూరు: దెందులూరుకు చెందిన దాత రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఫజ్లుల్ రెహమాన్‌కు ఏపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఏపీసీఈఓ ముతవల్లి పదవిని సోమవారం ప్రకటించింది. నియామక పత్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దెందులూరులో రెహమాన్‌కు అందజేశారు. ఆధ్యాత్మికాభివృద్ధి కోసం దెందులూరులోని ఆర్ రెహమాన్ మసీదును ఆయన 2022లో వక్ఫ్ బోర్డుకు దానం చేశారు. రెహమాన్ చేస్తున్న ఆధ్యాత్మికాభివృద్ధి, సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ముతవల్లి పదవికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. అనంతరం రెహమాన్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

పాఠశాలల పనివేళల్లో మార్పు

దెందులూరు: ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళలు మార్పు చేసినట్టు దెందులూరు ఎంఈఓ సీహెచ్ బుద్ధావ్యాస్ సోమవారం తెలిపారు. ఇప్పటివరకు 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు పనిచేశాయన్నారు. మండుతున్న ఎండల కారణంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 20వ తేదీ నుంచి ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయని అన్నారు. 11 గంటల తరువాత భోజనం పెట్టి విద్యార్థులను పంపిస్తామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పంపించామన్నారు.

వడదెబ్బకు దూరంగా ఉండాలి

గణపవరం: వేసవిలో ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడు, చిలకంపాడులో కూలీల వద్దకు వెళ్లి వడదెబ్బకు దారితీసే పరిస్థితులు, నివారణ చర్యలను వివరించారు. వడదెబ్బకు గురికాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని, ఎండలో వెళ్లేప్పుడు గొడుగు వాడాలని, పలుచని, కాటన్ దుస్తులు ధరించాలని తరచూ నీరు తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని ఏమాత్రం నీరసం అనిపించినా ఓఆర్ఎస్ ద్రావణం తాగి వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకన విధులపై ఆసక్తి ఉంటే తెలపండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పదో తరగతి బోధనలో మూడు సంవత్సరాల అనుభవం ఉండి స్పాట్ ఆర్డర్లు రాని ఉపాధ్యాయులు ఏలూరులో జరిగే మూల్యాంకన విధులపై ఆసక్తి కలిగిన వారు వెంటనే తమను సంప్రదించాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు తమకు వారివారి జిల్లాల్లో స్పాట్ ఆర్డర్లు వచ్చినట్లెతై, దానికి బదులుగా ఏలూరులో మూల్యాంకనం చేయడానికి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు కూడా సంప్రదించవచ్చన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

పెదపాడు: మండలంలోని వేర్వేరు చోట్ల పేకాట స్థావరాలపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామ శివారు ప్రాంతంలో సోమవారం పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురుని అదుపులోకి తీసుకుని, రూ.1,800 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీంతోపాటు ఏపూరు గ్రామంలోని చెందుల కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు: ఓ వ్యక్తి అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని కొనికి గ్రామానికి చెందిన పండు వెంకట్రావు (34) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడతూ మతిస్థిమితం లేకుండా ఇంటి పట్టునే ఉంటున్నారు. ఈనెల 13న కృష్ణా జిల్లా కుదరవల్లిలో ఆటో ఎక్కి ఎక్కడికో వెళ్లిపోయాడని, గతంలో ఇలా కూడా ఈ విధంగా వెళ్లి వచ్చేవాడని ఈసారి రాకపోవడంతో తల్లి ఆగ్నేసమ్మ పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట్రావుకు భార్య పిల్లలు ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెదపాడు: ఏపూరులో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. సోమవారం ఉదయం లక్ష్మీనృశింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

పెదవేగి : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎంపీపీ తాతా రమ్యకుమార్ ప్రారంభించారు. తహసీల్దారు యన్.నాగరాజు, ఎంపీడీవో జి.ఆర్. మనోజ్, డీటీ భ్రమరాంబ పాల్గొన్నారు.

డీఐజీ, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీప్రశాంతిని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాసుబాబు వారికి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తానని వారికి తెలిపారు.

30లోగా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

జంగారెడ్డిగూడెం : పాలిసెట్ – 2023కు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ముగిసినందున విద్యార్థులందరూ పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 10వ తేదీన పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లా అభ్యర్థులంతా ఏలూరులో ఏర్పాటు చేయబడిన 4 సెంటర్లలో పరీక్ష రాయవలసి ఉంటుందన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు సోమవారం హెచ్చరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	08-10
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	36
కాకర కాయలు	32-36	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	50	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	60
ఆనబకాయ (1)	10-12	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	33
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33